క్లుప్తంగా

లంపీ స్కిన్‌పై జాగ్రత్తగా ఉండండి



నందవరంలో ఎద్దుకు టీకాలు వేస్తున్న పశువైద్యుడు నరేంద్రనాథ్ రెడ్డి

నందవరం: పాడిరైతులు పశువులలో సంక్రమించే లంపీ స్కిన్ వైరస్‌పై జాగ్రత్తగా ఉండాలని పశువు వైద్యులు డాక్టర్ నరేంద్రనాథ్ రెడ్డి సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువైద్యులు ఎద్దులకు, పశువుల టీకాలు వేశారు. అలాగే గేదెలకు గాలికుంట వ్యాధి నివారణకు టీకాలు వేసి గేదెలకు చూడి పరీక్షలు నిర్వహించారు.

ప్రతి రైతు ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలి

పెద్దకడబూరు : మండలంలోని ప్రతి రైతు తప్పకుండ ఈ – క్రాప్ నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి సుచరిత సూచించారు. సోమవారం ఈ-క్రాప్ నమోదును పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో సాగుకు సంబంధించిన ఈ – పంట డిజిటల్ సర్వే నమోదు గడువును ఈ నెల 25వ తేదీ వరకు పొడిగించినట్లు తెలిపారు. ఇప్పటి వరకు పంట నమోదు చేసుకోవడానికి వీలుకాని రైతులు తప్పని సరిగా తమ పంటల వివరాలను రైతుసేవా కేంద్రాల ద్వారా పంట నమోదు చేసుకోవాలన్నారు.

అదనపు గదుల నిర్మాణానికి భూమిపూజ

నందవరం : మండల పరిధిలోని సోమలగూడూరు గ్రామంలో ఎస్సీ కాలనీలోని ఎంపీపీ స్కూల్‌లో అదనపు గదుల నిర్మాణానికి ఎస్ఎస్ఏఈ శివశంకర్ భూమిపూజ చేశారు. సోమవారం గ్రామంలోని మండల ప్రాథమిక పాఠశాల ఆవరణలో గ్రామ పెద్దలు వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో అధికారులు భూమి చేసి పనులు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. పాఠశాల శిథిలావస్థలో ఉన్నందున ప్రభుత్వం మూడు అదనపు గదుల నిర్మాణానికి రూ.43.50 లక్షలు నిధులు మంజూరు చేసిందన్నారు. త్వరగా పనులు ప్రారంభించి పూర్తి చేస్తామని వివరించారు.

జీఎస్టీ తగ్గింపుతో లబ్ధి

ఎమ్మిగనూరుటౌన్: కేంద్రప్రభుత్వం జీఎస్టీ తగ్గించడంతో ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరుతుందని స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ విజయరాణి అన్నారు. సోమవారం పట్టణంలోని బాలికల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జీఎస్టీ 2.0 వేడుకలను నిర్వహించారు. జీఎస్టీ స్లాబ్‌ల తగ్గింపుతో కలిగే లాభాలను విద్యార్థినులకు వివరించారు.


కార్మిక సంక్షేమ బోర్డును నిర్వీర్యం చేయొద్దు

ఎమ్మిగనూరుటౌన్: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును నిర్వీర్యం చేయవద్దని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కోశాధికారి బాలరాజు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక కార్మిక శాఖ కార్యాలయంలో అధికారి శ్రీకాంత్‌కు వినతి పత్రం ఇచ్చి మాట్లాడారు. భవన నిర్మాణ కార్మికులకు ఇసుక అందుబాటులో వుంచి పనులు కల్పించాలన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15నెలలు గడిచినా ఇచ్చిన హామీ మేరకు ఉచిత ఇసుక అందుబాటులో లేకపోయిందన్నారు. 13గంటల పనివిధానం రద్దు చేసి 8గంటల పనిగంటల విధానాన్ని అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ నాయకులు బాబు, మల్లికార్జున, వెంకటేష్, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

స్పెషల్ ఇంక్రిమెంట్లు ఇవ్వాలి

ఆదోని టౌన్: వార్డు, గ్రామ సచివాలయాల్లో పనిచేసే ఉద్యోగులు ఆరేళ్ల పూర్తి అయిన సందర్భంగా స్పెషల్ ఇంక్రిమెంట్లు ఇవ్వాలని సోమవారం సచివాలయ ఉద్యోగులు మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణకు వినతి పత్రం అందించారు. ఆదోని సచివాలయ ఉద్యోగ సంఘం నాయకులు రామచంద్ర, చంద్రశేఖర్, చంద్రకళ, నాగబాబు, అనిల్, వీరన్న, మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులకు ఉద్యోగభద్రత కల్పించాలని, సీనియారిటీ మేరకు పదోన్నతులు కల్పించాలన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ఆదోని రూరల్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జీఎఫ్ఐ) ఆధ్వర్యంలో గవర్నమెంట్ కాలేజ్ ఫర్ మెన్ కర్నూలులో నిర్వహించిన జిల్లా స్థాయి సెలక్షన్‌లలో మండలంలోని పెద్దతుంబళం గ్రామానికి చెందిన విద్యార్థులు షేక్షావలి అండర్-14 విభాగంలో, రెహాన్ అండర్-17 విభాగంలో ప్రతిభ చాటి రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికై నట్లు హెచ్ఎం మారుతిప్రియ తెలిపారు. సోమవారం స్థానిక పాఠశాలలో విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల సీనియర్ ఉపాధ్యాయులు సూర్యప్రకాష్, గణిత ఉపాధ్యాయులు సూర్యప్రకాష్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సర్వీసు పత్రాలు లేక నిలిచిన సచివాలయ సేవలు

మండల కేంద్రంలోని గ్రామ సచివాలయాలు-1,-2,-3లో సర్వీసు పేపర్లు లేక సేవలు నిలిచిపోయాయి. విద్యార్థులు, గ్రామ స్తులు సచివాయాల్లో ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలతో పాటు ఈబీసీ, ఈడబ్ల్యూఎస్ ధ్రువ పత్రాలు నమోదు చేసుకున్న తరువాత వాటిని మంజూరు చేసేందుకు సర్వీసు పేపర్లు లేక పోవడంతో సేవలు నిలిచిపోయాయి. సచివాలయాల్లో దాదాపు 20 రోజులుగా సర్వీసు పేపర్లు లేవని సచివాలయ ఉద్యోగులు చెబుతున్నారు. ఈ విషయంపై ఎంపీడీఓ కృష్ణమూర్తిని వివరణ కోరగా సర్వీసు పత్రాలు లేక పోవడం వాస్తవమేనన్ని , మంగళవారంలోగా ఎంపీడీఓ కార్యాలయానికి వస్తాయని వివరించారు. సర్వీసు పత్రాలు వచ్చిన వెంటనే సచివాయలకు అందజేసి సేవలు అందిస్తామని వెల్లడించారు.

– నందవరం

మౌలిక వసతులు కల్పించాలని రాస్తారోకో



సర్కిల్‌లో నిరసన తెలుపుతున్న కాలనీ వాసులు, నిలచిపోయిన వాహనాలు



మాట్లాడుతున్న సువర్ణరాజు

కౌతాళం: మండల పరిధిలోని ఎరిగేరి గ్రామంలోని ఆర్డీటీ కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ జైభీమ్, ఎంఆర్‌పీఎస్‌ల ఆధ్వర్యంలో కాలనీవాసులు సోమవారం బదినేహాల్ సర్కిల్‌లో రాస్తారోకో చేపట్టారు. దీంతో రెండు గంటల పాటు ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. కాలనీ ఏర్పడి 2సంవత్సరాలైనా వసతుల కల్పనలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని జైభీమ్ అధ్యక్షుడు అవతారం నిప్పులు చెరిగారు. ఈ సందర్భంగా అవతారం, ఏపీ ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సువర్ణరాజు మాట్లాడుతూ.. గ్రామంలో ఆర్డీటీ సంస్థ నిరుపేదలకు వంద ఇళ్లు ఉచితంగా నిర్మించి ఇచ్చిందన్నారు. కానీ కాలనీలో రోడ్డు, డ్రైనేజీ లేకపోవడంతో మురుగు నీరు, వర్షపు నీరు ఇళ్ల ముందు నిలబడటంతో దుర్వాసన వస్తోందన్నారు. కాలనీ వాసులు దోమలు, పురుగులు, పాముల మధ్య బిక్కు బిక్కుమంటూ బతుకుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ సబ్‌ప్లాన్ నిధుల నుంచి డ్రైనేజీలు నిర్మించి, రోడ్లకు కనీసం గ్రావెల్ అయిన వేయాలని, దీనికి సంబంధించి హామీ ఇస్తేనే ధర్నా విరమిస్తామంటూ రోడ్డుపైనే బైఠాయించారు. అక్కడి చేరుకున్న కౌతాళం సీఐ అశోక్‌కుమార్ ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్‌తో ఫోన్లో మాట్లాడించారు. కాలనీ వాసులను మంగళవారం కర్నూలు తీసుకెళ్లి విషయాన్ని కలెక్టర్‌కు వివరించి, 24గంటల్లోపు సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. కార్యక్రమంలో వీరేష్, చిన్న, రాజు, ఆదాం, హరి, సల్మాన్, కుమార్, శీను, నరసప్ప, సుధాకర్, కాలనీ పెద్దలు పాల్గొన్నారు.



వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వై.ప్రదీప్ రెడ్డిని ఆహ్వానిస్తున్న ఎంపీపీ ఈరన్న, వాల్మీకి నాయకులు

వాల్మీకి జయంతిని జయప్రదం చేయాలి

కోసిగి: మండల కేంద్రం కోసిగిలో మంగళవారం నిర్వహిస్తున్న వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను జయప్రదం చేద్దామని ఎంపీపీ ఈరన్న, వాల్మీకి నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం ఎమ్మెల్యే స్వగ్రామం రాంపురం గ్రామంలో వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వై. ప్రదీప్ రెడ్డి, జిల్లా కార్యదర్శి పి. మురళీ మోహన్ రెడ్డిలను కలిసి ఆహ్వానించారు. నేడు కోసిగి లో జరిగే కార్యక్రమానికి హాజరుకావాలని కోరారు. వాల్మీకి నాయకులు బుళ్లి నరసింహులు, కాంట్రాక్టర్ నాగరాజు, నేలకోసిగి లక్ష్మన్న, ఆంజనేయులు, వెంకటేష్, చిన్నా, వీరారెడ్డి ఉన్నారు.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణను ఉపసంహరించుకోవాలి



మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షాబీర్ బాషా

ఆదోని సెంట్రల్: ప్రభుత్వ మెడికల్ కళాశాలలను పీపీపీ విధానం పేరుతో ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టాలనే ఆలోచనను కూటమి ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సోమన్న, షాబీర్ బాషా, సీపీఐ పట్టణ కార్యదర్శి వీరేష్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ఏఐవైఎఫ్ కార్యాలయంలో ఏఐఎస్ఎఫ్ డివిజన్ ముఖ్య నాయకుల సమావేశం ఏఐఎస్ఎఫ్ డివిజన్ కార్యదర్శి దస్తగిరి అధ్యక్షతన జరిగింది. వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని 10 మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేసేందుకు మంత్రి మండలి సమావేశంలో తీసుకున్న నిర్ణయం సరైంది కాదన్నారు. పీపీపీ విధానం అమలు చేస్తే వందలాది మంది ప్రతిభ కలిగిన పేద, మధ్య తరగతి విద్యార్థులకు వైద్య విద్య దూరమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు శ్రీకాంత్, శివ, మోహన్, వంశీ, సురేష్, గురు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గరుడసేవ

మద్దికెర : మండలంలోని పెరవలి గ్రామంలో వెలసిన శ్రీ రంగనాథస్వామి సోమవారం పౌర్ణమిని పురస్కరించుకొని శ్రీదేవి, భూదేవి అమ్మవార్లతో కలిసి గరుడ వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం స్వామివారి మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించి బిందెసేవ తదితర పూజలు చేపట్టారు.

టమాట ధరలపై ఆరా



టమాటను పరిశీలిస్తున్న లావణ్య

పత్తికొండ: టమాట ధరలపై రైతుల ఆందోళనలపై ఎట్టకేలకు అధికారుల్లో కదలిక వచ్చింది. సోమవారం సాయంత్రం మార్కెటింగ్ కడప రీజియన్ డిప్యూటీ డైరక్టర్ లావణ్య స్థానిక మార్కెట్ యార్డును సందర్శించి ధరలపై రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో సాగు చేసిన టమాటకు మార్కెట్ ప్రారంభంలో 15 రోజులు తప్పా మిగిలిన రోజుల్లో గిట్టుబాటు ధర లభించలేదని చెప్పారు. అనంతరం మార్కెటింగ్ అధికారులతో సమావేశం నిర్వహించి గిట్టుబాటు ధర కోసం తీసుకోవలసిన అంశాలపై చర్చించారు. కొనుగోలు తరువాత మార్కెటింగ్ సదుపాయం తదితర సమస్యలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు.



పూజలందుకుంటున్న ఈరన్నస్వామి

ఈరన్న స్వామికి ప్రత్యేక పూజలు

కౌతాళం: మండల పరిధిలోని ఉరుకుంద గ్రామంలో వెలసిన ఈరన్నస్వామి దర్శనానికి సోమవారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. దీంతో స్వామి క్షేత్రంలో సందడి నెలకుంది. అర్చకులు స్వామి వారి మూలవిరాట్‌కు తెల్లవారు జామున సుప్రభాతసేవ, మహామంగళహారతి, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించి ఫలపుష్పాలతో అలంకరించారు.

13 నుంచి ఉచిత కంప్యూటర్ శిక్షణ

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని ఎస్ఎంఎల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 13వ తేదీ నుంచి ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉచిత కంప్యూటర్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు స్కిల్‌హబ్ కోఆర్డినేటర్ సుధాకర్‌బాబు సోమవారం తెలిపారు. 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ చదివి ఆసక్తి వున్న వారికి శిక్షణ ఇవ్వనున్నామని పేర్కొన్నారు. ఆసక్తి వున్న అభ్యర్థులు తమ పేర్లను కళాశాలలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. వివరాలకు సెల్ నంబర్ 8885904099కు సంప్రదించాలన్నారు.

'దొంగఓట్లతో గద్దెనెక్కిన మోదీ సర్కార్'

ఎమ్మిగనూరుటౌన్: కేంద్రంలోని ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వం దొంగఓట్లతో గద్దెనెక్కిందని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ ఖాశింవలి ఆరోపించారు. సోమవారం పట్టణంలో ఓట్‌చోరీకి వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పట్టణంలో ప్రజలు, వ్యాపారుల నుంచి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు ఆసిఫ్, భాస్కర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యను పరిష్కరించాలి

ఆదోని రూరల్: ఆస్పరి మండలం ములుగుందం గ్రామంలో నెల రోజుల నుంచి విద్యుత్ అంతరాయం కలుగుతోందని, విద్యుత్ సమస్యను పరిష్కరించాలని డీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ధణాపురం ఉదయ్, డీఎస్ఎఫ్ నాయులు అరవింద్ సోమవారం సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్‌కు విన్నవించారు. వారు మాట్లాడతూ అర్ధరాత్రి పూట కూడా విద్యుత్ అంతరాయం కలుగుతుందని, దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు.

రీసర్వే పకడ్బందీగా పూర్తి చేయాలి



రీ సర్వే ప్రారంభిస్తున్న తహసీల్దార్ వేణుగోపాల్

కోసిగి: మండలంలో మూడవ విడుత రీసర్వే ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని తహసీల్దార్ వేణుగోపాల్ సూచించారు. సోమవారం మండలంలోని నేలకోసిగి, ఐరన్‌గల్లు, కామన్‌దొడ్డి గ్రామాల్లో మూడవ విడుత రీసర్వేను ప్రారంభించారు. ఇందుకు ఆయా గ్రామాల్లో పొలాల రైతులకు ముందుస్తు సమాచారం అందించి రీసర్వే చేపట్టాలన్నారు. రీ సర్వే డీటీ దేవనాథ్, వీఆర్వో బసవరాజు, సర్వేయర్లు సుంకన్న, పరుశురామ్ తదితరులు పాల్గొన్నారు.

వృత్తి విద్య కోర్సులతో మంచి భవిష్యత్తు

కౌతాళం: వృత్తి విద్య కోర్సులతో విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందని కోర్సు శిక్షణ ఉపాధ్యాయుడు రాజు అన్నారు. సోమవారం కౌతాళం జిల్లా పరిషత్ పాఠశాల పదో తరగతి విద్యార్థులకు వృత్తి విద్య కోర్సుల్లో ఇంటర్న్‌షిప్‌లో భాగంగా విద్యార్థులకు స్థానిక మీసేవ కేంద్రం మొబైల్ పరికరాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

డ్రైనేజీ నిర్మాణ పనుల పరిశీలన



నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కమిషనర్

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని సాయి నగర్, బ్లాసం కిడ్స్ స్కూల్ ప్రాంతంలో నిర్మిస్తున్న డ్రైన్ నిర్మాణ పనులను సోమవారం మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి పరిశీలించారు. ఆయా పనులను సత్వరం పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈ రాజునాయక్, ఏఈ ప్రతాప్ పాల్గొన్నారు.

స్కాలర్ షిప్‌నకు దరఖాస్తు చేసుకోండి

చిప్పగిరి: కేంద్ర ప్రభుత్వం అందజేసే ఎన్ఎంఎంఎస్ స్కాలర్ షిప్‌నకు అర్హత కలిగిన 8వ తరగతి విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ఎంఈఓ ఫరూఖ్ సూచించారు. స్థానిక ఎంఈఓ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు అర్హత పరీక్ష రాయాల్సి ఉంటుందన్నారు. ఒక్కసారి ఎంపికైతే ఇంటర్ ద్వితీయ సంవత్సరం వరకు ఏడాదికి రూ.12వేల చొప్పున అందిస్తుందని చెప్పారు. దరఖాస్తుకు ఈ నెల 15వ తేదీ వరకు అవకాశం ఉందని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం వద్దు

ఆదోని రూరల్: పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టం (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో వచ్చిన అర్జీలను ఏ ఒక్క అధికారి నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో పీజీఆర్ఎస్ నిర్వహించి డివిజన్‌లోని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. మండలంలోని ఆయా శాఖల అధికారులకు సంబంధించిన సమస్యలను తెలియజేస్తూ గడువులోపు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బియాండ్ ఎస్ఎల్ఏలోకి వెళ్లకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వేణుసూర్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పద్మజ, ఆర్టీసీ డిపో మేనేజర్ రఫీ, వ్యవసాయశాఖ అధికారి ఖాద్రి తదితరులు పాల్గొన్నారు.

పార్టీని మరింత బలోపేతం చేయాలి



మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డిని సత్కరిస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్, వార్డ్ ఇన్‌చార్జ్‌లు



మాజీ ఎమ్మెల్యేను సత్కరిస్తున్న మైనారిటీ నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: నియోజకవర్గంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ఐక్యతతో పని చేయాలని మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి సూచించారు. వైఎస్సార్‌సీపీ సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్(సీఈసీ) మెంబర్‌గా నియామకమైన ఆయనను సోమవారం ఆయన నివాసంలో జిల్లా వక్ఫ్‌బోర్డ్ మాజీ ఉపాధ్యక్షుడు రియాజ్‌అహమ్మద్, మాజీ కోఆపరేటివ్ స్టోర్స్ చైర్మన్ షబ్బీర్ అహమ్మద్, కోఆప్షన్ మెంబర్ అబ్రార్, షాబుద్దీన్‌లతో పాటు మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, పార్టీ పట్టణ ఉపాధ్యక్షుడు బజారిరెడ్డి, మున్సిపల్ వార్డు ఇన్‌చార్జ్‌లు సోమేష్, వీరేష్, చంద్ర, ఫయాజ్, పామయ్య, గోనెగండ్ల పార్టీ మండల కన్వీనర్ కేవీ కృష్ణారెడ్డి, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు తిరుమల్‌రెడ్డి తదితరులు శాలువా కప్పి, పూలమాల వేసి సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా పార్టీ నాయకులు కాశిరెడ్డి, పుట్టపాశం గంగాధర్, కేఆర్ రామకోటిరెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, ఎమ్మిగనూరు మండల యూత్ అధ్యక్షుడు బి.బసిరెడ్డి తదితరులు మాజీ ఎమ్మెల్యేను సత్కరించారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి





ఆదోని ధర్నా చేస్తున్న నాయకులు, ఎమ్మిగనూరులో తహసీల్దార్ శేషఫణికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

పెద్దకడబూరు : అధిక వర్షాల వల్ల నష్టపోతున్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సత్యన్న, మండల కార్యదర్శి హనుమంతు డిమాండ్ చేశారు. ఏఐకేఎంఎస్(అఖిల భారత రైతు కూలీ సంఘం) ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దారు కార్యాలయంలో సోమవారం తహసీల్దారు గీతాప్రియదర్శినికి వినతిపత్రం సమర్పించారు.

గోనెగండ్ల : రైతులకు ఎకరాకు రూ.50వేలు నష్ట పరిహారం ఇవ్వాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పంపన్న గౌడ్, సీపీఐ జిల్లా సమితి సభ్యుడు మద్దిలేటి నాయుడు, తాలూకా అధ్యక్షుడు మాలిక్ స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఐ, ఏఐకేఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.

కౌతాళం: ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం మండల కార్యదర్శి ఈరన్న ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి వినతి పత్రాన్ని అందజేశారు.

రైతులకు పరిహారం అందించాలి

ఆదోని రూరల్: అధిక వర్షాల వల్ల పంటలు నష్టపోయిన రైతులకు తక్షణమే ప్రభుత్వం పంట నష్టపరిహారం అందించి ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేశులు డిమాండ్ చేశారు. సోమవారం రైతులతో కలిసి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతులు వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి పండించిన పంటలు అధిక వర్షానికి దెబ్బతిని దిగుబడి వచ్చే పరిస్థితి లేదన్నారు. ఆదుకోవాల్సిన ప్రభుత్వం కాలయాపన చేయడం తగదన్నారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని డిప్యూటీ తహసీల్దార్ బాబుకు అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కె.లింగన్న, రైతు సంఘం మండల కార్యదర్శి అయ్యప్ప, జిల్లా కమిటీ సభ్యులు బాషా, రైతు సంఘం మండల కమిటీ సభ్యులు హనుమంతరెడ్డి, చిన్నతిక్కన్న, ముత్తన్న తదితరులు పాల్గొన్నారు.

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

ఎమ్మిగనూరుటౌన్: దెబ్బతిన్న పలు పంటల మొక్కలను తీసుకొని సీపీఐ పట్టణ, మండల కార్యదర్శులు రంగన్న, రాజీవ్, రైతు సంఘ నాయకులు కెసి.జబ్బార్‌లు ఆయా సంఘాల ఆధ్వర్యంలో స్థానిక సోమప్ప సర్కిల్ నుంచి ర్యాలీగా రెవెన్యూ కార్యాలయం వద్దకు వెళ్లారు. అక్కడ ధర్నా చేపట్టి వినతి పత్రాన్ని తహసీల్దార్ శేషఫణికి అందజేశారు.

మంత్రాలయం రూరల్ : అధిక వర్షాలతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి భాస్కర్ యాదవ్, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం తహసీల్దార్ రమాదేవికి వినతి పత్రం అందజేశారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

కోసిగి: మండల కేంద్రం కోసిగిలోని నాడుగేని వీధిలో నివాసం ఉంటున్న రాజోలిబండ లక్ష్మీ (35) ఈనెల 1వ తేదీన వితంతు పింఛన్ కోసం కుమారుడు చరణ్‌తో కలిసి బైక్‌పై వెళ్తూ రోడ్డు ప్రమాదం మృతిచెందిన విషయం విధితమే. సోమవారం ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి పి.మురళీ మోహన్ రెడ్డి కోసిగికి చేరుకుని ఆమె కుమారుడు చరణ్, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆ కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే కుటుంబం, పార్టీ నాయకత్వం అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ మండల మహిళ నాయకురాలు, మాజీ ఎంపీపీ నాడుగేని భీమక్క ఉన్నారు.